క్లుప్తంగా

శిశుసంరక్షణ కేంద్రాలకు అనుమతి తప్పనిసరి



చిల్డ్రన్ హోమ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

గంట్యాడ: శిశు సంరక్షణ కేంద్రాల (చిల్డ్రన్ హోమ్స్) నిర్వాహణకు ప్రభుత్వ అనుమతి తప్పనసరి అని జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీఓ) యాళ్ల నాగరాజు అన్నారు. మండలంలోని దిగువ కొండపర్తిలోని విశ్వాసి సంఘటి చిల్డ్రన్ హోమ్‌లో గురు వారం ఆయన తనిఖీలు చేశారు. హోమ్‌లో బాలల ఆరోగ్యం, వారికి కల్పిస్తున్న వసతి, సంరక్షణ, విద్య, భద్రత తదితర అంశా లపై నిర్వాహకులను ఆరా తీశారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా హోమ్ నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. పిల్లలకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఐసీడీఎస్ పీఓ డోకుల ఉమా భారతి, ఎస్ఐసీ పీఓ బి.రామకోటి, కౌన్సిలర్ వెన్నెల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్లాంలో నేత్ర వైద్యశిబిరం

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్న ట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్లాం రామమంది రం వద్ద ఉదయం 8 గంటలకు శిబిరం ప్రారంభమవు తుందని పేర్కొన్నారు. నేత్రసమస్యలు ఉన్న గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలంతా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెచ్‌ఐవీపై అవగాహన



ర్యాలీని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: హెచ్‌ఐవీపై ఖచ్చితమైన అవగాహన ఉండాలని, ఎయిడ్స్‌వ్యాధి గ్రస్తులను అంటరానివారిగా చూడడం తగదని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, జి.సమీర అన్నారు. మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ఎయిడ్స్‌పై గురువారం అవగాహన ర్యాలీ నిర్వ హించారు. హెచ్‌ఐవీ వ్యాధి సంక్రమించే విధానాలను వివరించారు. హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకున్న తర్వాతనే రక్తదానం చేయాలని సూచించారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ ఎస్.ఎ.బాషా, పీహెచ్ఎన్ఎం రోజారమణి, ఇతర వైద్యసిబ్బంది లక్ష్మి, సత్యవతి,బీనా తదితరులు పాల్గొన్నారు.

రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్పించాలని 108 సంస్థ ఆన్‌జాబ్ ట్రైనర్ (ఓజేటీ) ఆలుబిల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 108 సంస్థ కార్యాలయంలో గురువారం ఈఎంటీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, కాలిన గాయాలకు అందించాల్సిన చికిత్సపై అవగాహన కల్పించారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ సాయిషణ్ముఖ్, ఉపేంద్ర పాల్గొన్నారు.

డీఐపీఆర్ఓ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్

విజయనగరం అర్బన్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి నూతన కార్యాలయాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. ఇప్పటివరకు కలెక్టరేట్ మేడపై ఉన్న డీఐపీఆర్ఓ కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లోని పాత ట్రెజరీ కార్యాలయం వద్దకు మార్చు చేశారు. ఆధునీకరించిన ఈ భవనాలను జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్ఓ ఎస్‌డీ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖాధికారి డి.రమేష్ మాట్లాడుతూ అన్ని వసతులతో అందరికీ అందుబాటులో సౌకర్యవంతంగా ఉంటుందన్న ఉద్దేశంతో కార్యాలయాన్ని మేడపై నుంచి కిందకు మార్పు చేయడం జరిగిందన్నారు. కార్యాలయ మార్పును జిల్లా అధికారులు, పాత్రికేయులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ పరిపాలనాధికారి దేవ్‌ప్రసాద్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరిపైరుకు జీవన ఎరువుగా అజొల్లా



శృంగవరపుకోట: వినాయకపల్లిలో వరిపైరులో రైతులతో కలిసి అజొల్లా వేస్తున్న వ్యవసాయశాఖ రీజనల్ కో-ఆర్డినేటర్ ప్రకాష్, తదితరులు

శృంగవరపుకోట: వరి పైరుకు అజొల్లా జీవన ఎరువుగా ఉపయోగపడుతుందని వ్యవసాయశాఖ రీజనల్ కో-ఆర్డినేటర్ ప్రకాశ్ అన్నారు. మండలంలోని సంతగవిరమ్మపేట యూనిట్ పరిధిలో వినాయకపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను గురు వారం ఆయన పరిశీలించారు. వరిసాగులో అనుసరిస్తున్న విధానాలు, ఎరువుల యాజమాన్యం, జీవామృతాలు, కషాయాల తయారీ తదితర అంశాలపై రైతులను ఆరా తీసి వారికి ఉన్న అవగాహన తెలుసు కున్నారు. లైన్ సోయింగ్ విధానంలో వరినాట్లు వేసుకోవడం, కాలిబాటల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వరిలో అజొల్లా వేయడం పంటకు కావా ల్సిన నత్రజని అందిస్తుందని, మొక్క వేర్లకు తగినంత ఆక్సిజన్ అందు తుందని, పొలం నిండా అజొల్లా ఉండడం వల్ల నీరు త్వరగా ఆవిరికాదని, ఫలితంగా నీటి తడులు అందించాల్సిన అవసరం తగ్గుతుందని, కలుపు సమస్య కూడా ఉండదని వివరించారు. అజొల్లా పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతుందని, దీని విని యోగంతో పాల ఉత్పత్తి, వెన్నశాతం గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. వరి క్షేత్రాల్లో గట్లపైన పండ్ల జాతి, కూరగాయలు మొక్కలు సాగు చేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం దక్కడంతో పాటు పంటకు చీడపీడల బెడద తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ రవిచంద్ర, మాస్టర్ ట్రైనీ కోటిబాబు, కృష్ణ, చరణ్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జామి: వీఆర్‌ఓలు, వీఏఏల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణలత

ఈ-క్రాప్ నమోదుకు సహకరించాలి

జామి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియలో వ్యవసాయశాఖ సిబ్బందికి వీఆర్‌ఓలు సహకరించాలని తహసీల్దార్ కృష్ణలత సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఏఏలతో ఏఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్‌ఓలు సమన్వయంతో పని చేసి ఈ-క్రాప్ నమోదు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కౌలు రైతులకు కౌలు హక్కు పత్రాల మంజూ రు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

గాలికుంటువ్యాధి నివారణే లక్ష్యం



మెరకముడిదాం: కుంచుగుమడాంలో పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ రామ్‌ప్రసాద్‌బాబు, వైద్యాధికారి హైమావతి



దత్తిరాజేరు: పెదమానాపురంలో పశువులకు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

మెరకముడిదాం: పశువులను వేధిస్తున్న అంటువ్యాధుల్లో ప్రమాదకర గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి టీకాలు వేస్తున్నామని మెరకముడిదాం, గర్భాం పశువైద్యశాలల వైద్యాధికారి సీహెచ్.హైమావతి అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథ కంలో భాగంగా మండలంలోని కొర్లాం, కొత్తకర్ర, సిరియాలపేట, కుంచుగుమడాం గ్రామాల్లో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో 730 పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. అలా గే వివిధ రకాల పరీక్షల కోసం 26 పశువుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. పశుపోషణపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. శిబిరాలను జిల్లా పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ రామ్‌ప్రసాద్ బాబు తనిఖీ చేశారు.

జాగ్రత్తలు పాటించాలి

దత్తిరాజేరు: పశుపోషణలో పాడిరైతులు జాగ్రత్తలు పాటించాలని పెదమానాపురం పశువైద్యాధికారి దినేష్ సూచించారు. పెదమానాపురంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి 200 పశువులకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

నేడు ఉపాధి పనుల ఎంపికపై గ్రామసభలు

మెరకముడిదాం: ఉపాధి హామీ పనుల ఎంపికపై మండలంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రత్నం గురువారం ఓ ప్రక టనలో తెలిపారు ఉత్తరావల్లిలో నిర్వహించే గ్రామసభకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు హాజరు కానున్నారని పేర్కొన్నారు. మండల ప్రజా ప్రతినిధులు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

గుర్ల మండలంలో ..

గుర్ల: ఉపాధి హామీ పనుల ఎంపికకు సంబంధించి మండలంలోని 42 గ్రామ పంచాయతీల్లో శుక్ర వారం గ్రామ సభలు నిర్వహించ నున్నట్లు ఎంపీడీఓ కల్యాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ పంచాయతీకి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు పేర్కొన్నారు. సభలకు గ్రామస్తులు హాజరై అభివృద్ధి పనులపై చర్చలో భాగస్వాములు కావాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

దత్తిరాజేరు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన శుక్ర వారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమా వేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

25న వక్తృత్వ పోటీలు

చీపురుపల్లి: స్థానిక కొత్తగవిడివీధిలోని గీతామందిరంలో ఈనెల 25వ తేదీన శ్రీమద్భగవద్గీతపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు గీతా సత్సంగ్ సేవాశ్రమ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు ఉంటాయని, ఆసక్తిగల విద్యార్థులు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

26న బెస్ట్ శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

చీపురుపల్లి: శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో ఈ నెల 26వ తేదీన చిన్నారులకు బెస్ట్ శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం ఇన్‌చార్జి బి.కె.శాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అయిదేళ్ల లోపు చిన్నారులకు జూనియర్స్ విభా గంలో, ఆరు నుంచి పదేళ్ల లోపు పిల్లలకు సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. రాధా, కృష్ణలు వేషధారణలతో పాటు హావభావాలతో కూడి న పోటీలు నిర్వహిస్తున్నామని, రెండు నుంచి మూడు నిమిషాలు నిడివిలో శ్రీకృష్ణుని కోసం పాట లేదా కథ చెప్పడం భగవద్గీత శ్లోకం చెప్పడం చేయాలని స్పష్టం చేశారు. 26న సాయంత్రం 5.30 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల వారు 90001 08721, 83099 74599 నంబర్లకు ఫోన్ చేసి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేపాడ: మండలంలోని జాకేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గం టల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలి పారు. మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని గుడివాడ, జగ్గయ్యపేట, అరిగిపాలెం, సోంపురం, శింగరాయి, కొత్తశింగరాయి, ఏ.ఎన్.ఆర్ ఎస్టేట్, కసిరెడ్డిపాలెం, ఆతవ, ఆకులసీతంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు, పోలీసులు

గజపతినగరం: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్, మెంటాడ జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. బుధవారం రాత్రి మెంటాడ జంక్షన్‌లో పోలీస్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగురోడ్ల జంక్షన్, మెంటాడ జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్ సిబ్బందితో పర్యవేక్షణ చేపడతామని చెప్పారు. మద్యంతాగి వాహనాలు నడిపే వారిపై, మైనర్లకు వాహనాలు ఇచ్చే వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

గరివిడిలో రక్తదాన శిబిరం



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు



శృంగవరపుకోట: తిమిడి గ్రామంలో చిరంజీవి అభిమానులు ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా గరివిడి పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద ఆయన అభిమానులు గురు వారం రక్త దాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పట్టణానికి చెందిన పలువురు యువకులు రక్తదానం చేశారు. చిరంజీవి అభిమానులు ఆటో రమణ, ఎస్.వి.జి.శ్రీనివాస రావు, ప్రమీల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిమిడిలో వైద్య శిబిరం

శృంగవరపుకోట: సినీనటుడు చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా పట్టణ మెగా పవర్ సేవా సంఘం అధ్యక్షుడు డి.రమణ ఆధ్వర్యంలో తిమిడి గ్రామంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులకు వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చే శారు.అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఒబ్బిన సత్యనారాయణ, చంటి, సతీష్, మోపాడ చిన్ని, కె.రవి, ఒబ్బిన శంకర్ తది తరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పాటూరులో విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ -2 బాలభాస్కరరావు



బానాదిలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారి అభ్యసనా సామర్థ్యాన్ని మెరుగుపరచాలని ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు సూచించారు. పాటూరు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 బాల భాస్కరరావు, బానాది యూపీ స్కూల్‌ను ఎంఈఓ జగదీశ్వరరావు గురువారం సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, ఉపాధ్యాయుల లెసెన్ ప్లాన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

కామ్రేడ్ సూరిబాబు ఆశయాలను కొనసాగిద్దాం..

విజయనగరం పూల్‌బాగ్: సూరిబాబు పోరాట స్ఫూర్తితో ప్రజా, కార్మిక పోరాటాలు కొనసాగిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు పిలుపునిచ్చారు. కామ్రేడ్ బుగత సూరిబాబు నాలుగో వర్ధంతి కార్యక్రమాలను స్థానిక డీఎన్ఆర్ అమర్ భవన్, పి.డబ్ల్యూ మార్కెట్‌లలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ బుగత సూరిబాబు చిత్రపటానికి నాయకులు, కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. 48 ఏళ్ల పాటు కార్మికుల కష్టనష్టాల్లో అండగా నిలుచున్న సూరిబాబును స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.రంగరాజు, అప్పలరాజు, అప్పరుబోతు జగన్నాథం, పొందూరు రాంబాబు, బూర వాసు, కెల్ల సూర్యనారాయణ, పతివాడ శ్రీను, నంద గణేష్, పలువురు మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని లావేరురోడ్ నుంచి గాజులువీధి మీదుగా చెరువు గట్టు వరకు రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ సిమెంట్ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరడంతో ఈ విషయం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తక్షణమే ఆయన స్పందించి రూ.5 లక్షలు మంజూరు చేశార ని వివరించారు. స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎ స్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, గవిడి కల్కి, అప్పికొండ ఆదిబాబు, మల్లెంపూడి శ్రీను, ముల్లు పైడిరాజు, గాజులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



పెదమానాపురం ఎస్ఐ జయంతి



బొండపల్లి ఎస్ఐ మహేష్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా జి.జయంతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాడంగి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు.

బొండపల్లి ఎస్ఐగా మహేష్

బొండపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా యు.మహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గజపతిగనరం నుంచి బది లీపై ఇక్కడికి వచ్చారు. పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. మండలం పరిధిలో రోడ్డు ప్రమా దాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

గుర్ల ఎస్ఐగా నారాయణరావు

గుర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పి.నారాయణరావును నియమిస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి.విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేసిన ఈయన బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ భాస్కరరావుకు బదిలీ అయ్యింది.

డిగ్రీ ప్రవేశాలకు 24 వరకు ఉచిత రిజిస్ట్రేషన్



అనంతగిరిలో గిరిజన విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 24 వరకు ఉచితంగా రిజి స్ట్రేషన్ చేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు చెప్పారు. డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్ల కోసం అధ్యాప కుల బృందంతో కలిసి అనంతగిరి గ్రామంలో గురువారం ప్రచారం నిర్వహించారు. అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళా శాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులను కలిసి డిగ్రీ చదువుల కోసం తమ కళాశాలలో చేరాలని కోరారు. తమ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని, ల్యాబ్, క్రీడామైదానం, లైబ్రరీ, హాస్టల్ వంటి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.ఈరన్న, భాస్కర్, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి



పి.ఎస్.ఆర్.పురం గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

గజపతినగరం రూరల్: అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని గజపతినగరం ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. మండలంలోని పి.ఎస్.ఆర్.పురంలో గ్రామస్తులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. పలు అంశాల పై అవగాహన కల్పించారు. ఇటీవల దొంగతనాలు పెరిగాయని, గ్రామంలో అనుమానస్పదంగా సంచరిస్తూ ఎవరైనా కనిపిస్తే వెంటనే ఫోన్‌లో 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. యువత మాదక ద్రవ్యాలు,మద్యానికి బానిసగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, చెడుస్నేహాలు, అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భీమసింగి సుగర్స్ రైతు మహాజన సభ నిర్వహించండి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న లోక్‌సత్తా పార్టీ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: భీమసింగి సుగర్స్ రైతు మహాజన సభ నిర్వహించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా జాయింట్ కలెక్టర్, సుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ సేతుమాధవన్‌ను కోరారు. ఈ మేరకు గురువారం జేసీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఫ్యాక్టరీ పరిస్థితిపై ఆయనతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భీమసింగి సుగర్ ఫ్యాక్టరీకి రాష్ట్రంలో ఒక ప్రత్యేకత ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ చెరుకు ఫ్యాక్టరీని తెరుస్తుందని ఈ ప్రాంత రైతులు ఆశలు పెట్టుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు కూడా ఎన్నికల్లో అదే ప్రకటన చేసారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం దీనిపై సరైన నిర్ణయం తీసుకొని రైతులు, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఆయనతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడు తాట్రాజు రాజారావు ఉన్నారు.

పన్ను చెల్లింపునకు 'క్యూఆర్ కోడ్'



నూతన విధానం అమలుపై సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: వ్యాపార, వాణిజ్య రంగాల్లో విస్తరించిన డిజిటల్ లావాదేవీలు క్రమక్రమంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అమలవుతున్నాయి. ఆ దిశగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది. ఇప్పటివరకు వివిధ రకాల పన్నులు, చలానాలను కేవలం నగదు రూపంలో స్వీకరిస్తుండగా.. తాజాగా నగదు రహిత డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై క్యూఆర్ కోడ్ ద్వారా ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌లతో ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసుకోవచ్చని కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. నూతన విధానం అమలులో సాంకేతిక సమస్యలపై బ్యాంకు, అకౌంట్స్ విభాగ అధికారులు ప్రయోగాత్మకంగా చేపట్టిన క్యూఆర్ కోడ్ విధానం విజయవంతమైందని పేర్కొన్నారు. ప్రజల సౌలభ్యం కోసం ఆన్‌లైన్ పేమెంట్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చామని, నగరవాసులు దీన్ని వినియోగించుకోవాలని కోరారు.